# ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

చొప్పదండి, నవంబర్ 30: మండలంలో సార్వత్రిక ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని 16 గ్రామాల్లో ఏర్పాటు చేసిన 48 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సందర్శించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. హెల్ప్ డెస్క్‌లవద్ద ప్రజలు పోలింగ్ బూత్, ఇతర వివరాలు తెలుసుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. వృద్ధులు, సీనియర్ సిటీజన్లను వాహనాల్లో ప్రభుత్వ సిబ్బంది తీసుకువచ్చి ఓటు వేయించారు. రామడుగు మండలం వెలిచాలలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు–కవిత దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ ఉపేంద్రాచారి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



చొప్పదండి: పోలింగ్ సరళి గురించి అడిగి తెలుసుకుంటున్న సీపీ అభిషేక్ మహంతి

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

చొప్పదండి, నవంబర్ 30: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు కరీంనగర్ పోలీస్‌కమీషనర్ అభిషేక్ మహంతి పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ సరళిని, పోలింగ్ కేంద్రంలో చేసిన ఏర్పాట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ కమీషనరేట్ పరిదిలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, జిల్లా వ్యాప్తంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందిగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కమీషనరేట్ పరిదిలోని సిబ్బందితో పాటు ఇతర జిల్లాల పోలీస్ సిబ్బంది, ఇతర రాష్ట్రాల పోలీస్ సిబ్బందిని కేంద్రబలగాలను సమన్వయం చేస్తూ బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేవిధంగా ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్ఐ ఉపేంద్రాచారి, మునిసిపల్ కమీషనర్ శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండి: పట్టణంలో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు



మంగళపల్లిలో భార్యను ఓటు వేసేందుకు తీసుకువస్తున్న భర్త



తండ్రిని ఓటు వేసేందుకు తీసుకువస్తున్న తనయుడు

## పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

సిరిసిల్ల రూరల్, నవంబర్30: తంగళ్లపల్లి మండలం తాడూరులోని పోలింగ్ కేంద్రాన్ని గురువారం జిల్లా పోలీసుల ఎన్నికల పరిశీలకురాలు వినీత సాహు పర్యవేక్షించారు. ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షించారు. పలు సూచనలు చేశారు.

సిరిసిల్ల టౌన్, నవంబర్ 30: సమయం ముగిసాక జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలలోని పోలింగ్ కేంద్రంలోకి బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమ వెళ్లడంతో అక్కడే ఉన్న బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి మ్యాన రవి అభ్యంతరం తెలిపారు. దీంతో అధికారుల సూచనతో రాణిరుద్రమ పోలింగ్ కేంద్రం నుంచి బయటికి వెళ్లిపోయారు.

కోనరావుపేట, నవంబర్ 30: మండలంలోని ధర్మారం, నిమ్మపల్లి, కోనరావుపేటలోని పోలింగ్ సరళిని ఎన్నికల వ్యయ పరిశీలికుడు మణిగండస్వామి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇక్కడ ఎంపీడీవో ఓదేలా రామకృష్ణ తదితరులు ఉన్నారు. శివంగాళపల్లికి చెందిన నేరెళ్ల జ్యోతి తన చిన్న వయస్సులోనే పార్టీ సిద్ధాంతాలను నమ్మి మావోయిస్టులో చేరింది. 2004లో ఆమె మావోయిస్టులోకి వెళ్లగా, కొన్ని నెలల క్రితం లొంగిపోయింది. తొమ్మిదేండ్ల కాలం నుంచి సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి గులాబీ కండువా కప్పుకుంది. దీంతో మొదటిసారిగా స్వగ్రామంలో తొలి ఓటు హక్కును వినియోగించుకుని సంతోషం వ్యక్తం చేసింది.



తాడూరులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల పోలీస్ పరిశీలకురాలు వినీత సాహు

## ఓటేసిన ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, నవంబర్ 30: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మేరకు 116వ పోలింగ్ కేంద్రంలో ఓటేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లా పరిధిలో ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి భద్రత ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

## దుబాయి నుంచి వచ్చి ఓటేసి..

ముస్తాబాద్, నవంబర్ 30: పోతుగల్‌లో సహకార సంఘం అధ్యక్షుడు తన్నీరు బాపురావు కుమారుడు సాయినందన్‌రావు మంత్రి కేటీఆర్‌పై ఉన్న ప్రేమతో దుబాయి నుండి వచ్చి నూతనంగా వచ్చిన ఓటు హక్కును వినియోగించుకున్నాడు. ముస్తాబాద్‌లోని ఇందిరమ్మ కాలనీకి చెందిన భూదవ్వ ఓటర్ లిస్ట్‌లో పేరు గల్లంతైదని పోలింగ్ కేంద్రానికి వచ్చి ఆవేదన వ్యక్తం చేసింది.

## ఓటేసిన ప్రముఖులు

సిరిసిల్ల రూరల్, నవంబర్ 30: తంగళ్లపల్లి మండలంలో ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తన స్వగ్రామమైన కస్బెకట్కూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. గులాబీ షర్టు ధరించి ఓటు హక్కును వినియోగించుకోవడం గమనార్హం. కోరుట్లపేటలో నవతేజ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ చైర్మన్ గంద్ర యాదగిరి రావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. బస్వాపూర్‌లో జడ్పీటీసీ పుర్మాణి మంజుల–రాంలింగారెడ్డి దంపతులు తమ కూతురితో కలి సి ఓటు హక్కును వినియోగించుకున్నారు. తంగళ్లపల్లిలో ఎంపీపీ పడిగెల మానస–రాజు దంపతులు, మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మండెపల్లిలో సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్, జిల్లెల్లలో ఏఎంసీ చైర్‌పర్సన్ పూసపల్లి సరస్వతి–రామచంద్రం దంపతులు తమ కు టుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లెల్లలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మధు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకట్రావు, కస్బె కట్కూర్‌లో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వేణుగోపాలరావు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## తొలి ఓటు గుర్తుండి పోయేలా

- మొదటి ఓటు వినియోగించుకున్న యువత

కార్పొరేషన్/కమాన్‌చౌరస్తా, నవంబర్ 30: జిల్లా కేంద్రానికి చెందిన యువత తమ తొలి ఓటు వినియోగించుకుని సంబురపడ్డారు. రాష్ట్రాధికారం దక్కే ఎన్నికల్లో తామూ భాగస్వాములవ్వడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో 'నమస్తే తెలంగాణ' పలువురు యువతను పలకరించగా, వారు ఆనందంగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

### సంతోషంగా ఉంది



అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్నాను. ఇది మాటల్లో చెప్పలేని సంతోషం. ఓటు బాధ్యతను పెంచుతుంది అనే విషయం ఓటు వేసిన నాకు అర్థమైంది.

**- అర్చన, మంకమ్మతోట**

### ఓటు వేయడం బాధ్యత



తొలి ఓటు మంకమ్మతోటలోని ధన్గర్‌వాడీ పాఠశాలలో వేశాను. మా కుటుంబ సభ్యులు ఓటు వేయడం మన బాధ్యత అని చెప్పారు. ఆ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యంలో భాగస్వామికావడం ఆనందంగా ఉంది.

**- సాయిహిందు, మంకమ్మతోట**

### ఓటు వజ్రాయుధం లాంటిది



ఓటు వజ్రాయుధం లాంటిది. నేను ఆ ఆయుధాన్ని ఉపయోగించుకున్నాను. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయడం ద్వారా మనం సమాజాభివృద్ధిలో భాగస్వాములం అవుతాం అనే ఆలోచనకు రావాలి. అప్పుడే అభివృద్ధి మన కండ్ల ముందు ఉంటుంది.

**- రతన్‌సాయి, మంకమ్మతోట**

### రాజ్యాంగం కల్పించిన బాధ్యత



ఓటు హక్కు మనకు రాజ్యాంగం కల్పించిన బాధ్యత. ఆ బాధ్యతను తొలి సారి ఓటు వేసి నిర్వర్తించాననే సంతోషంగా ఉంది. ఇక నుంచి అవకాశం ఉన్న ప్రతి సారి ఓటు హక్కును వివినియోగించుకుంటాను. సమాజంలో నా వంతు బాధ్యతను నిర్వర్తిస్తాను.

**- మేఘన, రాంనగర్**

### జీవితంలో గుర్తుండిపోతది



ఓటు హక్కు మొదటి సారి వినియోగించుకోవడం జీవితంలో గుర్తుండిపోతది. మన నాయకుడిని మనం ఎన్నుకునే అవకాశం ఓటు ద్వారానే సాధ్యం. ఈ అవకాశం నాకు వచ్చిందని సంతోషంగా ఉంది. అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి.

**- చల్ల సాత్విక్, రాంనగర్**

### ఓటు విలువను పెంచుతుంది



తొలి సారి ఓటు వేసినందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ ఓటు మన విలువను పెంచుతుంది. ప్రభుత్వాలు ఓటరు బాధ్యతను తెలిపేలా చాలా కార్యక్రమాలను రూపొందిస్తున్నాయి. అలాంటి ఓటును ఒక ఆయుధంలా మార్చుకుని, మన బాధ్యతను నిర్వర్తించాలి.

**- మనీష, కార్ఖానగడ్డ**

### ప్రత్యేకంగా వచ్చి ఓటు వేశా



ఓటరుగా నమోదు చేసుకున్న తర్వాత వచ్చిన అవకాశం కావడంతో ప్రత్యేకంగా వచ్చి వినియోగించుకున్నా. ఇది గొప్పగా అనిపిస్తుంది. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేసి మన నగరం, రాష్ట్రం, దేశ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి.

**- వైష్ణవి, భగత్‌నగర్**

### ఓటు ప్రజాస్వామ్యానికి పునాది



మొదటి సారి ఓటు వేయడం ఆనందంగా ఉంది. మొదటిసారి ఓటు వేసేటప్పుడు చాలా ఎక్సైట్ అనిపించింది. ఓటు ప్రజాస్వామ్యానికి పునాది. అందరూ తప్పక ఓటు హక్కు వినియోగించుకోవాలి.

**- సింధు హర్షిత, చల్లురు, వీణవంక మండలం**